పరిమళ

మిస్ సుధారాణి



గాలి రివ్వున వీచింది.

కిటికీ తలుపులు పెద్దగా శబ్దంచేస్తూ అటూ యిటూ ఊగిసలాడుతున్నయ్. కిటికీపక్కనే ఉన్న టేబుల్ మీది బున్సెన్ బర్నర్ గుప్పు మని ఆరి పోయింది.

టెస్టుట్యూబ్ పట్టుకుని బర్నరు మీద ఏదో వేడి చేస్తున్న సరోజ ఉలికిపడి తలెత్తి చూసింది "మేడమ్" వైపుగా.

"ఆచారీ! కిటికీ తలుపులు వేసి, లైట్లు వెలిగించు" అంటూ అరచింది మిస్ సుధారాణి కుర్చీలోనుండి లేస్తూ.

ఆచారి తలుపును వేసి స్విచ్ నొక్కాడు. కెమిస్ట్రీ లాబొరేటరీ అంతా ఒక వింత కాంతితో మెరిసిపోతోంది. ఆచారి నిప్పు పెట్టె తెచ్చి సరోజ బర్నర్ వెలిగించాడు.

"ఎన్ని రాడికల్సు డిటెక్టు చేసావు?" సరోజనిని సమీపిస్తూ అడిగింది మిస్ సుధారాణి

"మ్...మ్...మ్మూడండీ......"

"యువర్ నెంబర్?" పుస్తకంలో పేజీలు తిరగవేస్తూ అడిగింది మేడమ్.

"సెవెంటీ యైట్."

"యాసిడ్ రాడికల్స్ ఏమిటి?"
"బొరేటు, టార్టరేట్."
"టార్టరేట్ ఎలిమినేట్ చేశావా?"
"చేసా మేడమ్."
"బొరేట్‌కి గ్రీనెడ్జ్‌డ్ ఫ్లేమ్‌వచ్చిందా?"
"వచ్చింది మేడమ్"
"సరే. బేసిక్ రాడికల్స్...ఏ గ్రూపు?"
"సెకండ్ గ్రూప్."
"ఏ మెటల్?"
"మె... ర్క్యు...రీ."
"మెర్క్యురీనా?"
"ఎస్... మేడ...మ్!"

"మెర్క్యురీ లేదు. సరీగ్గా ఎనలైజ్ చేసి చూడు." వెళ్ళిపోయింది మేడమ్.

కర్చీఫ్‌తో నుదుటిమీది చెమట బిందువులను తుడుచుకుంది సరోజ. కళ్ళకిడ్డం పడుతున్నా పొడుగాటి వెంట్రుకలను పైకి తోసుకుని పక్కపిన్ను సరిచేసికొంటూ మేడమ్ కుర్చీవైపుకు ఓరగా చూసింది.

మిస్ సుధారాణి తనవంకే చూస్తోంది.

అంతే. చటుక్కున ఆమె చెయ్యి క్రిందికి దిగింది. టెస్ట్‌ట్యూబ్ పట్టుకుని సెకండ్ గ్రూప్ మొదటినుంచీ చెయ్యటం ప్రారంభించింది.

అరగంట గడచింది

బయట హోరు మనే గాలితోపాటు గణగణ మనే బెల్లు విన్పించింది

చేతివాచీ చూసుకుంటూ సుధారాణి వచ్చింది.

"ఎంతవరకు వచ్చావ్?"

"సెకండ్ గ్రూప్‌లో లెడ్ ఉన్నదండీ."

ఎండిన పెదవులను నాలికతో తడుపుకుంటూ టెస్ట్‌ట్యూబ్ ఎత్తి మేడమ్‌కి చూపింది. "గోల్డెన్ స్పాంగిల్స్ టెస్ట్."

"వెరీగుడ్... మరి యిందాక మెర్క్యురీ అని ఎందు కన్నావ్?"

కాలి బొటనవ్రేలితో నేలను రాస్తూ తల వంచి క్రిందిపెదవి కొరుక్కుంది సరోజ.

మిస్ సుధారాణి మెదడు గతంలోకి పరుగులు తీసింది. ఆ రోజు... అతను ప్రశ్నించినపుడు తను సరీగ్గా అలాగే నిలబడింది: అవే బెదురుచూపులు... అదే వణుకు...

"గట్టిగా 'కన్ఫర్మ్' చేసికోనిదే లెక్చరర్‌కి రిపోర్ట్ చెయ్యకూడదు. జాగ్రత్తగా ఒకటికి రెండుసార్లు టెస్ట్ చేసి అప్పుడుగాని ఒక కంక్లూజన్‌కి రాకూడదు... ఎక్జామినేషన్సులో తొందరపనికిరాదు..."

అలాగే నన్నట్లు వినయంగా తలూపింది సరోజ.

"ఇంకా ఎంత సేపు చేస్తావ్? ఐదు దాటింది"

"మరొక అరగంట చేస్తానండీ."

"అందరూ వెళ్ళిపోయారు. వర్షం వచ్చేటట్లున్నది. ఇంటికి వెళ్ళాలని లేదా?"



"ప్లీజ్... ఈ ఒక్క రాడికల్ కూడా చేసి..."

"సరే. నీ యిష్టం."

లేబొరేటరీ నుండి బయటకు వచ్చి వరండాలో నిలబడింది సుధారాణి.

సరోజను చూస్తుంటే, ఏవోస్మృతులు తన నుక్కిరి బిక్కిరి చేస్తున్నాయ్. ఆరేళ్ళక్రితం తన స్టూడెంట్ లైఫ్ గుర్తుకు వస్తోంది. సన్నగా బలహీనంగా ఉండే తను, బెదురుచూపులు చూస్తూ లేబొరేటరీలో ఎక్కడో ఒకమూల నిల్చుని ప్రయోగాలు చేసేది. ఇప్పుడు తను సరోజను ప్రశ్నించినట్లే శేఖర్ ఎప్పుతూ తనవద్దకు వచ్చి ఏమేం చేస్తూ న్నదీ అడిగి ఒక్కోప్పుడు మందలిం పుగా మాట్లాడేవాడు కూడా.

శేఖర్...! ఏనాటి శేఖర్ !; రంగు రంగుల ప్రపంచాన్ని చూసి వెఱ్ఱిగా పరుగెత్తిన శేఖర్, ఎక్కడున్నా డిప్పుడు?

బయట సన్నగా తుపర పడుతోంది. రివ్వున వీచిన గాలితోపాటు సన్నని తుపర ఆమె శరీరాన్ని ఆప్యాయంగా కౌగలించుకుంది. ఆమె దేహం పులక రించింది.

పల్చని వాయిల్‌చీర శరీరానికి అతుక్కుపోయింది. దూరంగా ఫిజిక్స్ స్టాఫ్‌రూమ్ ముందు నిలబడిన లెక్చె రర్ కృష్ణమూర్తి తనవంక అదేపనిగా చూడటం గమనించిన సుధారాణి కను బొమ్మలు చిట్లించుకుంటూ లేబొరేటరీ లోకి వెళ్ళింది. సరోజ అలాగే నిలబడి పంచిన తలెత్తకుండా ప్రయోగం చేస్తోంది.

సుధారాణి చిన్నగా నిట్టూర్పు విడిచింది ఆరోజుకూడా... అలాగే వర్షం కురుస్తోంది. తను సిల్వర్ నైట్రేట్—పొటాషియం క్లోరైడ్ టైట్రేషన్సు చేస్తోంది. ఎంతకూ రీడింగ్సు కోయిన్‌సైడ్ అవటంలేదు. ఏ ఒక్కరిద్దరో తప్ప స్టూడెంట్సంతా యిళ్ళకు వెళ్ళారు.

అభిమానంతో తనకి కళ్ళనీళ్ళు వచ్చాయి. అందరూ ప్రాక్టికల్సు చక్కగా చెకచెకా చేసేస్తారు. తను ఎప్పుడూ వెనకే ఉంటుంది. ఇలా అయితే తన కీఏడు ఫస్టుక్లాస్ వచ్చినట్లే. ఎం. యస్సీ. చదివే గీత తన ముఖాన లేదు కాబోలు. చేతిరుమాలతో కళ్ళు తుడుచుకుంది.

"వాట్ మిస్ సుధారాణీ? హౌ ఫార్ హావ్ యూ డన్?"

తలెత్తి చూసింది తను.

కళ్ళజోడులో నుండి క్రిందికి చూస్తూ అడిగాడు శేఖర్, 'టై' సవరించుకుంటూ.

అభిమానంతో తన ముఖం ఎఱ్ఱబడింది.

"కంకరెంట్ రీడింగ్సు రావటం లేదు సార్" వచ్చే ఏడుపును ఆపుకుంటూ అన్నది.

"ఎందుకు రావు ప్రయత్నిస్తే? నేను చూపిస్తా నుండు... ఏదీ ఆ కోనికల్ ఫ్లాస్క్ క్లీన్ చేసి యివ్వు" అన్నాడు శేఖర్, షర్టు చేతులు పైకి మడచుకుంటూ. తను ఫ్లాస్క్సు రెండు క్లీన్ చేసి యిచ్చింది

రెండు టైట్రేషన్సులోనూ పాయింట్ వన్ తేడా వచ్చింది కాసేపు బుఱ్ఱ గోక్కున్నాడు.

తను మళ్ళీ క్లీన్‌చేసి యిచ్చింది. ఈసారి జాగ్రత్తగా చేశాడు. సిల్వర్ నైట్రేట్ లాస్ట్ డ్రాప్ పడగానే ఏర్పడిన లేత గులాబీరంగు ప్రెసిపిటేట్ వైపు గుడ్లప్పగించి చూస్తూ నిలబడింది తను.

ఈసారి రెండు టైట్రేషన్సులోనూ రీడింగ్సు కోయిన్‌సైడ్ అయినాయి.

కళ్ళజోడు తీసి అద్దాలు రుమాలుతో తుడిచి మళ్ళీ ముఖానికి తగిలించుకున్నాడు శేఖర్

"నువ్వు కూడా మరో రెండు టైట్రేషన్సు చెయ్యి; యూ మస్ట్ బి వెరీ కేర్‌ఫుల్ అండ్ పేషెంట్, దట్సాల్; అంతకంటె మరో డిఫికల్టీ ఏం లేదు." ఎంకరేజ్ చేస్తూ వెళ్ళిపోయాడు.

వట్టి బెదురుగొడ్డు తను. ఎక్స్‌పెరిమెంట్ రాకపోతే ఏడవటం తప్ప లెక్చెరర్‌ని అడిగటం చేతకాదు. శేఖర్ మాస్టారు ఎంత మంచాయన! అరగంటలో టైట్రేషన్సు, కాలుక్యులేషన్సూ పూర్తి చేసుకొని వెళ్ళింది.

కుర్చీలో కూర్చుని 'మామ్' నవల చదువుతున్న శేఖర్ తనని చూడగానే పుస్తకంమూసి తన చేతిలోని నోట్‌బుక్ తీసుకుని సంతకం పెట్టాడు.

"పాయింట్ సిక్స్ పర్సంట్ ఎర్రర్, నాట్‌బాడ్..."

"థాంక్యూ సర్..."

"మేడమ్ :"

ఉలిక్కిపడింది మిస్ సుధారాణి.

"కాల్షియం వచ్చిందండీ :" సరోజ చేత్తో టెస్ట్‌ట్యూబ్ పట్టుకు నిలబడింది.

"కరెక్ట్" అంటూ సైన్ చేసింది.

సరోజ కళ్లు ఆనందంతో మిలమిల మెరిసినయ్ సుధారాణి పెదవులపై చిన్న నవ్వు.........చేతులు కడుక్కుని రుమాలుతో తుడుచుకుంది సరోజ. బుక్కుపట్టుకుని లేబొరేటరీ ద్వారంవద్ద మేడమ్ పక్కగా నిలబడింది.

జోరున వర్షం కురుస్తోంది.

ఎదురుగాఉన్న బొటానికల్ గార్డెన్‌లో పూలమొక్కలమీద పడిన వర్షపునీరు జలజలమంటూ క్రిందికి రాలింది. ఆ నీరంతా సన్నని పాయలుగా చీలి పల్లపు ప్రాంతమైన కెమిస్ట్రీ లేబొరేటరీ ముందు కాలవగట్టిన నీటిలో కలసింది. ఆ కాలవలో తేలుతున్న గడ్డిపరకలను చూస్తూ నిలబడింది సుధారాణి.

వర్షం కురిసిన ఆ రోజు అలాగే తను శేఖర్ పక్కన నిల్చున్నది.

"మిస్ సుధారాణీ :"

"ఏమిటి మాస్టారూ ?"

"పాపం ఒక్కదానివి ఎలా వెళ్తావు? వర్షం కురుస్తోంది"

"ఫరవాలేదండీ వర్షం తగ్గగానే రిక్షాలో వెళ్తాను."

"వర్షం తగ్గకపోతే ?" నవ్వుతూ ప్రశ్నించాడు శేఖర్.

"మీరూ, అటెండర్లూ ఉన్నారుగా. మీ రెలా వెళ్తే నేనూ అలాగే వెళ్తాను." మాస్టారి చనువుకు లోలోపల విస్తుపోయినా పైకి నవ్వుతూనే జవాబిచ్చింది.

"నిన్నొకటి అడుగుతాను...ఏమీ అనుకోవు కదా ?"

"ఏమిటది ? అడగకూడని ప్రశ్న మీరేం వెయ్యరుగా ?"

"ఎప్పుడూ అలా విచారంగా ఉన్నట్టు కన్పిస్తావేం ? యూ లుక్ లైక్ పెసిమిస్ట్."

"ఒక్కొక్కరి స్వభావం అది. దానికి నే నేం చెప్పేది ?" నవ్వింది తను.

"అవును. అదీ నిజమేలే. స్టూడెంటుగా ఉన్నప్పుడు...అంటే ఏడాది క్రిందటి వరకు నేనుకూడా అలాగే ఉండేవాడిని. నా ఫ్రెండ్సంతా నన్ను 'వీపింగ్ ఫిలాసఫర్' అని వెక్కిరిస్తూండేవాళ్ళు. ఉద్యోగంలోకి చేరినాక నవ్వటం, నలుగురితో మాట్లాడటం నేర్చుకున్నాను.''

జేబులోనుండి సిగరెట్‌పెట్టె బయటకు తీసి చటుక్కున ఆమె ముఖంలోకి చూసి ఏదో గుర్తుకి వచ్చినట్లు మళ్ళీ దానిని యధాస్థానంలో పెట్టేశాడు. ముఖం పక్కకు తిప్పుకుని నవ్వుకుంది తను.

వర్షమంటే చిన్నప్పటినుండీ తన కెంతో యిష్టం. ఎన్నోసార్లు పెద్దయినాక కూడా వర్షంలోనిలబడి జ్వరంతెచ్చుకుంది

చల్లని గాలీ...ధారలుగా పడుతున్న వర్షం !

''శేఖరం మాస్టారు ఎంత మంచి వారు!" ఆ విషయం అది మాటయాభ య్యోసారి తననుకోవటం.

"వర్షం కురుస్తుంటే మనసు కెంతో హాయిగా ఉంటుంది కదూ?"

ఉలికిపడింది తను. ఒక లెక్చెరర్ తనతో అంత క్లోజ్‌గా మాట్లాడుతుంటే ఏదో సంకోచ మనిపించింది. ఎన్నడూ అనుభవంలేని విషయం.

"అవునండీ!" అన్నది ఏమనాలో తోచక.

''మీ యిల్లెక్కడ?"

''అలంకార్ వద్ద."

"లెస్సన్స్ బాగా అర్థం అవుతున్నాయా?"

"ఊ......ఆ......"

"ఏమయినా డౌట్సుంటే నన్నడగ వచ్చు; నా సహాయం ఎప్పుడూ ఉంటుంది నీకు."

"థాంక్యూ సర్."

"నీలాటి స్టూడెంట్సుంటే నా కెంతో యిష్టం. నువు బ్రిలియంటని స్టూడెంట్సూ, లెక్చరర్లూ, అంతా అనుకుంటున్నారు. ఇప్పటినుండీ బాగా కృషిచేశావంటే మంచి రిజల్టు వస్తుంది. కాలేజీకి మంచి పేరు తెచ్చిపెట్టాలి."

కృతజ్ఞతా సంతోషాలతో పూడుకు పోయింది తనకంఠం తలవాల్చి మాస్టారి బూటువంక చూస్తూ నిలబడింది మౌనంగా.

"మేడమ్!"

కళ్ళలో నిలిచిన నీటిబిందువులను కర్చీఫ్‌తో తుడుచుకుంటూ పక్కకు చూచింది సుధారాణి.

"ఏమి టమ్మా?"

"మరి - మేడమ్... నాకు 'రేడియో యాక్టివిటీ' సరిగ్గా అర్థం కాలేదంటే క్లాస్‌లో— ఎప్పుడైనా వీలుంటే ఒకసారి ఎక్స్‌ప్లైన్ చేస్తారా?"

"ఓ — అలాగే!"

"ఎప్పుడు రమ్మంటారు మీ యింటికి?"

"కాలేజీ ఉన్నరోజుల్లో మార్నింగ్ నైన్ లోపల, యీవినింగ్ ఆఫ్టర్ సిక్స్ ఎప్పుడైనా సరే సాధారణంగా నేనెక్కడికీ వెళ్ళను. సెలవు దినాల్లో ఏటైమ్‌లో వచ్చినా ఫరవాలేదు''

"థాంక్యూ మేడమ్."

''నో — నో — దట్సాల్‌రైట్"

* * *

''చాలాబాగా చెప్పారు మేడమ్ మీరు. ఇన్నాళ్ళూ యీ లెస్సన్ అర్థంకాక తంటాలు పడుతున్నాను." పుస్తకాలు పుచ్చుకుని లేచి వెళ్ళబోతూ అన్నది సరోజ

"ప్రయత్నిస్తే సాధ్యంకాని విషయమేం లేదు."

"అవును మేడమ్."

"ఎప్పుడైనా డౌట్సు వస్తే యిలాగే చెప్పించుకుని వెళ్తూండు."



"అలాగే. యిక వస్తాను మేడమ్, గుడ్ నైట్."

"గుడ్‌నైట్."

గుమ్మంలో నిలబడి వీధిలైటు వెలుగులో నడచివెళ్తున్న సరోజ పొడుగాటి జడను చూస్తూన్న సుధారాణికి ఆలోచనలు ముసురుకున్నాయి.

"బాగున్నాయా నే నిచ్చిన ఎస్సేలు?" వాటిని తిరిగితీసుకుంటూ అడిగాడు శేఖర్.

"చాలా చక్కగా ఉన్నాయండీ. మీ ఎస్సేలు చదివిన తరువాత అంతకు ముందున్నడౌట్సన్నీ తొలగిపోయినయ్."

"థాంక్స్."

"...అని చెప్పవలసింది నేను."

"ఆఁ...ఎవరైతేనేం" నవ్వా డతను.

అతని రూములో టేబుల్ మీదున్న వెంకటేశ్వరస్వామి పటం చూసి "మీరు వెంకటేశ్వరస్వామి భక్తులేమిటి?" అని

అడిగింది తను ఆశ్చర్యంగా.

"అవును. మా యింటి యిలవేలపు ఆయనే." భక్తిశ్రద్ధ లుట్టిపడుతున్నాయ్ అతని కంఠంలో.

"ఐతే మీకు దేవుళ్ళన్నా, దెయ్యా లన్నా నమ్మకం ఉందన్నమాట.'' నవ్వాపుకోలేకపోయింది తను.

"ఏం. నీకు లేదా ?''

"ఉఁహుఁ... సైన్సు స్టూడెంటునయి ఉండికూడా దైవత్వాన్ని విశ్వసించలేను నేను."

''సైన్సుకీ — భగవంతునిపై విశ్వాసము ఉండటానికీ సంబంధ మేమిటి మిస్ సుధారాణీ ? ఎన్ని పరిశోధనలు జరిపినా మానవుడు తెల్సుకోలేని, చేరుకోలేని మహా సత్యా లలాగే మిగిలిఉన్నాయి. వాటిని తెలుసుకోవాలని కృషిసల్పే శాస్త్రజ్ఞుడికీ, భగవంతునిలో లీనమైపోవాలని పరితపించే భక్తుడికీ అట్టే తేడా లేదు— నా దృష్టిలో."

నోరు తెరచుకుని చూస్తూ కూర్చుండి పోయింది. ఆయ నలా మాట్లాడతారని తనూహించలేదు.

"నేనూ ఒకప్పుడు నీలాగే నాస్తికుడినే కాని తిరుపతి యూనివర్సిటీలో చదువు తుండగా ప్రతిరోజూ స్నేహితులతో పాటు షికారుకని కొండమీదకు తరచుగా వెళ్తుండేవాడిని. ఆ అలవాటే చివరకు అంతులేని భక్తిగా మారింది." నవ్వాడు శేఖర్.

తను తలవంచుకుని వింటోంది.

''ప్రతి ఉదయం స్నానానంతరం వేంకటేశ్వర సుప్రభాతం చదివనిదే నేను పచ్చిమంచినీళ్ళుకూడా ముట్టను.''

ఎందుకో అప్రయత్నంగా తన కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్.

తన స్వభావం భగవదారాధనకి విరుద్ధమైనా విద్యాధికుడూ, తన లెక్చెరరూ అయిన ఒక యువకహృదయంలో భగవంతుని ఎడల అంతటి భక్తివిశ్వాసా లున్నా యని వినినంతనే ఆత్మవిశ్వాసంతో కరుడుగట్టిన తన హృదయంలో ఏదో కదలిక కల్గుతున్నట్లు అనుభూతి కల్గుతోంది. 'భగవంతుని అవసరాన్ని ఆశించే పిరికితనం తనలో లేదు' అని ఒకప్పుడు ధైర్యంగా చూసే తనకళ్ళే యిప్పుడు ఆర్ద్రమవుతున్నాయి...ఎందు చేత ?

''ఆఁ అన్నట్లు... నేను 'వేంకటేశ్వర మాహాత్మ్యం' సినిమా ఇరవైసార్లు చూసాను తెలుసా ?'' తనని నవ్వించటాని కన్నాడు శేఖర్.

కాని యీసారి తను నవ్వలేక పోయింది.

''అరె, అదేమిటి సుధా —: ఏడుస్తున్నావా ? ఎందుకు ? ''

''మాస్టారూ...''

''మిస్ సుధా...''

ఆ పైన ఏమీ విన్పించుకోకుండా ఒక్క పరుగున అతని రూమ్నుండి

బయటకు వచ్చింది. ఇంటికివెళ్తూ దారిలో వేగంగా కంపిస్తున్న గుండెమీద చెయ్యి వేసికొని ఆరోజే మొదటిసారిగా అను కుంది "నేను శేఖరం మాస్టార్ని ప్రేమి స్తున్నాను."

* * *

ఆరోజు శుక్రవారం.

'మరో ఐదునిమిషాలకి సెకండియర్ బియస్సీ స్టూడెంట్సు...సరోజ బాచ్ వాళ్లు వస్తారు' అనుకుంది, మిక్శ్చర్స్ నూరు తున్న సుధారాణి.

ఐదు నిమిషాలు గడచాక బెల్లు విన్పించింది.

"అరే. అప్పడే బెల్లయిందే." గబ గబ మిక్శ్చర్సు పొట్లాలు కట్టి ప్రతి పొట్లంమీద నెంబరువేసి వాటిని తీసుకుని స్టోర్ రూమ్నుండి లెబొరేటరీలోకి వచ్చింది మిస్ సుధారాణి.

అప్పుడే స్టూడెంట్సంతా వచ్చేసారు.

తనకుర్చీ దగ్గరకు వెళ్తూ సరోజవంక ఓరగా చూసింది .

అందరూ వచ్చి ఎవరినెంబరుప్రకారం వారు ఆపొట్లాలు తీసుకుని వెళ్లిపోయారు. అటెండెన్సు తీసుకుని కుర్చీకి చేరగిలబడి కళ్ళు మూసుకుంది మిస్ సుధారాణి. ఆ ఆలోచనలు...వీటి బారినుండి తను ఎన్నటికీ తప్పించుకోలేదు. ఎడారి తుల్యమయిన తన ప్రస్తుతపు ఒంటరి జీవితంలో ఆ నాటి అనుభవాల స్మృతులే ఒయాసిస్సులు. ప్రతిరోజూ, ప్రతిక్షణం. తన జీవనదృక్పథాన్నే మార్చివేసిన బి. ఎస్సీ. రోజులు – ఎలా మర్చిపో గలదు? ఆ బాధాకరమైన స్మృతులలోనే ఏదో ఒక విచిత్రమైన రిలీఫ్ని పొందు తుంది తను. ఆ రిలీఫ్ ఎందుకు కల్గు తుందో, దాని స్వభావ మేమిటో తనకు తెలియదు. తను ప్రస్తుతం అనుభవిస్తున్న కఠోరమైన ఒంటరితనాన్ని విస్మరింప జేయటమే ఆ ఆలోచనలలోని ప్రత్యేక తేమో...

ఆ రోజు..యూరియా కాన్స్టిట్యూషన్ చెప్పించుకోవాలని అతని రూమ్ కి వెళ్ళింది.

కిలకిల నవ్వులు విన్పించి గుమ్మంవద్దే ఆగిపోయింది.

"భలేవారే మాస్టారూ, మీరు. చాలా ఫన్నీగా మాట్లాడతారు."

అది వాసంతి–తనక్లాస్మేట్ కంఠం.

వెంటనే మళ్ళీ పకపక నవ్వులు.

ఆ నవ్వులను బట్టి మరొక అమ్మాయి కూడా ఉన్నట్లు తెలుస్తోంది.

తను లోపలికి వెళ్ళటమా మానటమా ?

హఠాత్తుగా కర్టెన్ తొలగించుకుని బయటకు రాబోతున్న శేఖర్ సుధారాణికి ఒక్క డాష్ యిచ్చి వెంటనే వెనక్కి అడుగువేసి "హల్లో...మిస్ సుధారాణీ! కమిన్, కమిన్..." అన్నాడు కర్టెన్ పక్కకి తొలగించి దారి చూపిస్తూ.

లోపలికి అడుగుపెడుతూనే మంచం

మీద కూర్చున్న వాసంతి భారతులను చూసింది. కళ్ళు జిగేల్‌మన్నాయ్. గులాబీలతో, రెండు జెడలతో, ఖరీదైన దుస్తులతో వెలిగిపోతున్నా రిద్దరూ.

"ఇప్పుడే వస్తానుండండి" అని శేఖర్ బయటకు వెళ్ళిపోయాడు.

వాళ్ళ పక్కనే మంచం మీద కూర్చుంటూ కొద్దిగా మాసిన తన నేతచీర వంక చూసుకుని సిగ్గుపడింది. తన పేదరికాన్నీ, తన దుస్తులను గురించి ఆలోచించటం జీవితంలో అదే మొదటి సారి...

"హల్లో సుధారాణీ! ఏమిటి మీ చేతిలోని బుక్కు?" అన్నది భారతి.

"ఆర్గానిక్ కెమిస్ట్రీయా? అబ్బ! ఎంత శ్రద్ధండీ మీకు చదువుమీద? మీరు చూపే శ్రద్ధలో కనీసం సగం చూపినా ఫస్టుక్లాస్ వచ్చేను మాకు. కాని చదవాలంటే తగని బద్ధకం సుమా" అన్నది వాసంతి. బద్ధకం అన్నది అదో గర్వించతగ్గ విషయం అన్నట్లు. "అంతేకాదు నీలాగా నేను ఊరికే పుస్తకాల పురుగునీ; దుబ్బిరోలునీ కాను సుమా'' అని ఎత్తిపొడిచినట్లు కూడా అన్పించింది తన కా సమయంలో. పైగా వారిద్దరూ తన నేతచీరను గుచ్చి గుచ్చి పరిశీలిస్తున్నట్లు ఫీలయింది సుధారాణి. లేనినవ్వు బలవంతాన పెదవులపైకి తెచ్చుకుని, "ఎంతసేపు అయింది మీరు వచ్చి?" అన్నది.

"అరగంటయింది. ఇనార్గానిక్ కెమిస్ట్రీ చస్తే అర్థంకావటంలేదు. పరీక్షలింకా రెండునెల్లున్నాయి. ఈయేడు మోక్షం లభిస్తుందో లేదో నని హడలిపోయి యిలా పరుగెత్తుకు వచ్చాం. మొన్న నొకరోజున ఏమయినా తెస్సన్సు తెలియకపోతే రూమ్‌కివచ్చి చెప్పించుకోమన్నారు. ఏవో ఏస్సే లిచ్చారు కాని అవి మాలాంటి మట్టిబుఱ్ఱలకు అర్థమయితేనా?"

భారతికి సమాధానం యివ్వకుండా ఆలోచిస్తోంది. తను, సినీ నాలెడ్జి తప్ప చదువులో 'యావరేజి స్టూడెంటు' కుండవలసిన విజ్ఞానం కంటే ఓపాలు తక్కువే ఉన్న యీ హైహీల్డుయానలకు ఎస్సే లిచ్చి, తెలియని పాఠాలు రూమ్‌కి వచ్చి అడగమనటంలో శేఖర్ ఉదేశ్యం ఏమిటి? ఇదే సహాయం - యీ మాటలతోనే తనకి ఆఫర్ చేసినప్పుడు తను సంతోషంతో పొంగిపోయింది. తన తెలివి తేటలు చూసే తనకి సహాయం చేయాలని శేఖర్ భావిస్తున్నా డనుకుంది. కాని యిప్పుడు వీళ్ళ మాటలు వింటుంటే తనలో ఉందని భ్రమించిన 'ప్రత్యేకత' లేకపోగా, తన గర్వం దెబ్బతినటమే కాక యింతకాలం తను శేఖర్‌లోని ఏ ప్రవర్తన చూసి భ్రమపడి తన హృదయాన్ని ఆతని కంకితం చేసిందో ఆ ప్రవర్తనలో తననుకున్న దేమీ లేదని తెలిసిపోయింది. అవును, శేఖర్‌దృష్టిలో తన కెలాటి ప్రత్యేకమయిన స్థానం లేదు.

"నేను మీ కివ్వవలసిన డబ్బునుగురించి నా భార్యతో మాట్లాడండి, ఫతాన్ సాహెబుగారూ !"

వాసంతి, భారతి ఎంతో తను కూడా అంతే. భగవాన్—! ఎంత భయంకరమైన సత్యం! దీనిని యింతకాలం ఎందుకు గుర్తించలేదు? ఇప్పుడు గుర్తించినందున కలిగిన ప్రయోజనం మాత్రం ఏముంది? తన అభిమానం దెబ్బతింది, తన హృదయం తూట్లు పడింది... భగవాన్ తను నిజంగా మోసపోయిందా...?

శేఖర్ తిరిగి వచ్చాడు వెంట ఒక కుర్రవాడితో. ఆ కుర్రవాడు నలుగురికీ కాఫీ లందించాడు.

భారతీ వాసంతీ వయ్యారంగా గ్లాసు లందుకున్నారు.

తను విషం తాగినట్లు తాగి గ్లాస్ కింద పెట్టేసింది.

బాయ్ వెళ్ళిపోయాడు.

"ఇవాళ ముగ్గురికీ ఇనార్గానిక్ కెమిస్ట్రీ చెప్తాను" అన్నాడు శేఖర్ సుధారాణి వైపు చూస్తూ.

"అలాగే."

శేఖర్ పాఠం చెప్తున్నంత సేపూ మధ్యలో దౌట్సు అంటూ ఆ పేవారు

భారతీ, వాసంతీ. ఆయన నవ్వుతూ మళ్ళీ మొదలెట్టటం, మధ్యలో ఛలోక్తులతో నవ్వులతో...అలా సాగిపోయింది టీచింగ్. తనకి ముళ్ళమీద కూర్చున్నట్లనిపించింది. ఒకసారి ''ఏం సుధా? ఒంట్లో బాగుండలేదా?'' అనడిగాడు శేఖర్.

"లేదండీ. తల నొప్పిగా ఉంది"

"పోనీ, ఆపేస్తా నీ రోజుకి."

"ఉహుఁ. మీరు చెప్పండి. నేను కూర్చోలేకపోతున్నాను. ఇంటికి పోతున్నాను" అంటూ లేచింది.

"ఐ యామ్ వెరీ సారీ..."

"నో...నో...ప్లీజ్...! డోంట్ వర్రీ ఎబౌట్ మీ."

తూట్లుపడిన హృదయంతో బయటకు వచ్చింది తను.

"మిస్ సుధారాణీ!"

హఠాత్తుగ కళ్ళుతెరచింది సుధారాణి.

తన తోటి లెక్చెరర్ నారాయణరావు కుర్చీలో కూర్చుంటూ అన్నాడు నవ్వుతూ "రాత్రి సెకండ్‌షోకి వెళ్ళారేమిటి? నిద్రపోతున్నారు."

పేలవంగా నవ్వింది సుధారాణి.

"మాష్టారూ, టార్టరేట్‌కి సిల్వర్ మిర్రర్ టెస్ట్ రావటం లేదండీ" అంటూ వచ్చింది సరోజ.

"నేను చేసి చూపిస్తాను పద."

ఇద్దరూ వెళ్ళిపోయారు.

చిన్నగా నిట్టూర్పు విడిచింది సుధారాణి. అదేంగమ్మత్తో నారాయణరావుండగా సరోజ ఎన్నడూ తనని "డౌట్సు" అడగదు. ఎప్పుడూ అతనినే అడుగుతుంది. అతనూ అంతే. ప్రతిసారీ ఏదో ఒక వంకపెట్టుకుని సరోజనిని మాట్లాడిస్తూ ఉంటారు. ఈ సంగతి తను చాలాసార్లు గమనించింది. స్త్రీ పురుషులమధ్య ఉండే యీ పరస్పరాకర్షణ దీనికి సరియైన భాష్యం చెప్పగల సామర్థ్యం ఎవరికి ఉంది? తెలిసో, తెలియకో ఏదో ఒక నాడు ఒక వ్యక్తికి హృదయం అర్పితమయిపోయింది. సెన్సిటివ్‌గా ఉండే వాళ్ళు దానినే ప్రేమ అని పేరు పెట్టి, ఆ బంధాన్ని మరింత బిగువైనది, అందమైనదిగా చేయాలని తాపత్రయ పడతారు. కాని యిది కొద్దిమంది విషయాల్లో మాత్రమే; మరికొందరికి అది చాలా సర్వసామాన్యవిషయంగా గోచరిస్తుంది. తన హృదయ స్పందనానికి కారకుడైన ఆ వ్యక్తి తన జీవనపథంనుండి తప్పుకుంటే మరొక కొత్త ఆకర్షణకోసం, కొత్త ప్రేమకోసం, మరో ఆనందం కోసం అన్వేషిస్తుంది మనసు. అందులో తను మొదటిజాతికి చెందిన వ్యక్తయితే శేఖర్ రెండవ రకానికి చెందిన వ్యక్తి. తమలోని యీ వైవిధ్యమే తన ప్రస్తుత స్థితికి కారణం.

శేఖర్ తనయందు ప్రత్యేకమైన శ్రద్ధ చూపుతుంటే తను గర్వంతో మురిసిపోయింది. తనకి తెలియకుండానే

తన సర్వస్వాన్నీ అతని పాదాలముందు ధారవోసింది.

కాని... శేఖర్‌కి కావలసింది డబ్బూ, హోదా, ఆడంబరం. ఆకర్షణీయంగా అలంకరించుకుని హైహీల్డ్ షూస్ టకటక లాడించుకుంటూ తనతో చెట్టాపట్టాలు వేసుకు తిరిగే అమ్మాయిల మీద మోజెక్కువ. తనలోని వినయం, నిరాడంబరత్వం, తెలివి తేటలూ యివన్నీ అంటే అతనికి గౌరవం, కాని తనలో అతనికి కావలసిన "గ్లామర్" లేదు. తనలాటి స్త్రీని గౌరవించగలడు కాని, ప్రేమించలేడు శేఖర్.

ఈ విషయం గ్రహించిన దగ్గరనుండీ అతనినుండి తప్పుకుంది తను.

కాని తన అభిమానం తీవ్రంగా గాయపడింది. తను ప్రేమించిన పురుషుని నుండి ఆశించిన ప్రేమ లభించకపోవటంతో అది తిరస్కారంగానే భావించింది తను. ఆ భావం తన గుండెలో శూలంగా గుచ్చుకుంది. ఆ గాయమే తనని వివాహబంధానికి దూరంగా ఉంచింది ఇంతకాలమూను.

పరీక్ష లయినాక ఆఖరిరోజు — చివరిసారిగా శేఖర్‌ని చూడటానికి రూమ్‌కి వెళ్ళింది. వెళ్ళగానే "కమిన్...కమిన్" అంటూ ఎప్పటిలాగానే ఆహ్వానించాడు.

కాసేపు అవీ, యివీ మాట్లాడి "బి. యస్సీ. తరువాత ఏం చేస్తావు?" అని అడిగాడు.

"ఎం. యస్సీ!"

"వెరీగుడ్... మరి పెళ్ళి...?"

తన ముఖం ఎర్రపడింది — సిగ్గుతో కాదు, అభిమానంతో — ఏదో తెలియని క్రోధంతో.

"ఆ సంగతి మా పేరంట్సు చూసుకుంటారు."

"ఓ — దెన్ యు ఆర్ ఎ వొబీడియంట్ డాటర్;" నవ్వాడు శేఖర్.

తను నవ్వు తెచ్చుకుంది.

వస్తుంటే అందరు లెక్చరర్ల లాగానే "బ్రైట్ ఫ్యూచర్" ని ఎదుర్కోవాలంటూ విష్ చేశాడు.

అదే ఆఖరిసారి శేఖర్‌ని చూడటం.

తరువాత తను ఎం. యస్సీ. చదవడం, అదే కాలేజీలో లెక్చరర్‌గా అప్పాయింట్ అవటం జరిగింది. ఈలోగా శేఖర్‌కి బదిలీ అయిపోయింది మరో చోటికి. కాని అతన్నిగురించి త నెవరినీ ఏమీ అడగలేదు. బహుశా యీపాటికి పెళ్ళి చేసికొని యిద్దరు ముగ్గురు పిల్లల తండ్రయికూడా ఉంటాడు. అందం, ఐశ్వర్యం, చదువు, ఉద్యోగం ఉన్న అతని కేం తక్కువ? ఏ ఆడదాన్నయినా యిట్టే అతను పాదాక్రాంతం చేసికోగలడు.

కాని... తనో... యిప్పటికీ, యిక ఎప్పటికీకూడా మిస్. సుధారాణి!

"మేడమ్!"

కళ్ళనీళ్ళు రుమాలుతో తుడుచు

కుంటూ ఎదురుగా ఉన్న బాయ్‌స్టూడెంటు వంక చూసింది.

"ఆదేమిటి మేడమ్? కళ్ళు అలా ఉన్నాయ్?"

"నలక పడిందోయ్ కంట్లో. ఆఁ... నీ కేం కావాలి?"

"మెగ్నిషియం టెస్టు సరీగ్గా రావటం లేదండీ; మీరు చేసిపెడ్తారేమోనని..."

"పద చూపిస్తాను" అంటూ లేచింది సుధారాణి.

* * *

ఆర్నెల్లు గడచినయ్.

మధ్యాహ్నం సెకండ్ పీరియడ్ థియరీ క్లాసు తీసుకున్న తరువాత లెబొరేటరీలోకి వెళ్ళింది సుధారాణి. నారాయణరావు పసుపు అంటించిన కవ రందించాడు సిగ్గుపడుతూ.

నారాయరావు పెళ్ళి శుభలేఖ, వధువు-ఎవరో సరళట.

"కంగ్రాట్యులేషన్సు మిస్టర్ నారాయణరావ్!"

"థాంక్యూ మేడమ్."

అతను వెళ్ళిపోయాడు, శుభలేఖలు యితర లెక్చరర్లకి పంచియివ్వటానికి.

సరోజ సీటువంక చూసింది ఆమె మామూలుగా తల వంచుకుని ఎక్స్పెరిమెంట్ చేస్తోంది.

ఆ రోజు ఎందుకో సరోజ ఆమె వద్దకు రాలేదు అంతవరకు. బహుశా టెస్ట్లన్నీ వస్తున్నాయి కాబోల్ను.

బెల్ అయింది.

పది నిమిషాలలో అందరూ వెళ్ళారు. అలవాటు ప్రకారం సరోజ ఒక్కతే మిగిలింది. మిక్శ్చర్ పూర్తి చేయనిదే యింటికి వెళ్ళదామె.

"సరోజా!"

"మేడమ్, వస్తున్నా."

చేతులు కడుక్కుని రుమాలుతో తుడుచుకుంటూ వచ్చింది సరోజ.

"ఎంతవరకు చేశావ్?"

"ఫొర్త్ రాడికల్-బేరియం టెస్ట్ చేస్తున్నాను మేడమ్. ఐదు నిమిషాల్లో ఐపోతుంది...ప్లీజ్..."

అప్రయత్నంగా సరోజ కళ్ళు టేబుల్ పైని శుభలేఖమీద వాలాయి.

"నారాయణరావుగారి పెళ్ళి."

పాలిపోయిన ఆమె ముఖం వంక జాలిగా చూస్తూ అన్నది సుధారాణి.

"మాస్టారి... పెళ్ళా... !!" హీన స్వరంతో అన్నది సరోజ. జలజల రాలే కన్నీటిని ఆపుకోబోయి విఫలురాలు అయింది. సుధారాణి కళ్ళలోకూడా నీరు తిరిగింది.

"సరోజా!"

"మ... మ్మేడమ్..."

"ఏడుస్తున్నావా?"

"లే...దు మేడమ్...మరే రాత్రి నిద్రలేక."

"పిచ్చి సరూ... నాకంతా తెలుసు."

"మేడమ్!"